
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్

5

మంగళవారం 6 ఆగస్టు 2024

జిల్లాల వార్తలు

9న హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 5 : హెచ్‌సీఎల్ టెక్ బీ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఉద్యోగ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ ఓ ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో డీవీవో పోస్టు కోసం 75శాతం మార్కులతో ఇంటర్ పూర్తిచేసుకున్న విద్యార్థులను ఎంపిక చేసుకుంటారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పదోతరగతి, ఇంటర్ సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్, ఒక ఫొటోతో ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని ఆయన కోరారు.



బ్యాంకు వద్ద రైతులు లైన్‌లో పెట్టిన పాస్‌బుక్‌లు

రుణం కోసం పడిగాపులు

హత్నూర, ఆగస్టు 5: పంట రుణాల కోసం రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. రాత్రి వరకు వేచి చూసినా తమ పేరు రాకపోవడంతో ఉసూరుమంటున్నారు. హత్నూర మండల పరిధిలోని వడ్డేపల్లి ఏపీజీవీబీ బ్యాంకు పరిధిలో హత్నూర మండలంలోని 12 గ్రామాలతో పాటు జిన్నారం మండలం అండూర్, నర్సాపూర్ మండలం ఎల్లాపూర్ గ్రామాలకు చెందిన 1,800 మంది ఖాతాదారులు ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం రెండు విడతలుగా రైతు రుణాలు మాఫీ చేయడంతో ఆ రైతులు కొందరు తిరిగి రుణాలు తీసుకుంటున్నారు. అయితే రైతులు నిత్యం బ్యాంకు చుట్టూ తిరుగుతుండగా.. వచ్చిన వారిలో రోజుకు కేవలం 30మందికి మాత్రమే ఇస్తామని రుణాలు నిబంధన పెట్టడంతో, ప్రతీ రోజు ఉదయం 7 గంటల నుంచి రైతులు బ్యాంకు వద్ద బారులు తీరుతున్నారు. నిల్చోలేక నీరసించి పోయిన రైతులు కొందరు తమ పాసుపుస్తకాలను క్యూలైన్‌లో పెడ్తున్నారు. 30 మంది నిబంధనను తొలగించి, రైతులందరికీ రుణాలు అందించాలని కోరుతున్నారు.

పల్లెల్లో

పంచాయతీ పోరు



- ఎన్నికలకు కసరత్తు షురూ
- వార్డుల మ్యాపింగ్, ఓటరు జాబితాపై ఆపరేటర్లకు శిక్షణ పూర్తి
- ప్రత్యేకాధికారుల పాలనపై ఫిర్యాదులతో అప్రమత్తమైన ప్రభుత్వం
- గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధి
- విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు
- నిధులు రాక.. అజమాయిషీ లేక ప్రజల అవస్థలు

మెదక్, ఆగస్టు 5: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. రాష్ట్రంలో బీసీ కులగణన, పాత రిజర్వేషన్లు మార్చిన తర్వాతే ఎన్నికలు జరుగుతాయనుకుంటున్న తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని పకటించారు. ఈమేరకు నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌లో డాటాఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కూడా ఇచ్చారు. ఓటర్‌లిస్ట్ మెర్జింగ్ స్టేట్‌మెంట్ తయారు చేయాలని అధికారులకు ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. దీంతో గ్రామాల్లో ఎన్నికలపై చర్చలు మొదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 1,615 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.

ఆరు నెలలుగా ప్రత్యేక పాలన

పంచాయతీల పాలకవర్గాల గడువు జనవరి 31తో ముగియడంతో గ్రామాల్లో ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. అంతకుముందు అసెంబ్లీ ఎన్నికల హడావుడి కారణంగా నుంచి పంచాయతీలకు నిధులు అంతంతమాత్రంగానే అందాయి. దీంతో, దాదాపు ఏడాదిగా పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. వానాకాలం సీజనల్ రోగాలు ప్రబలకుండా కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా పంచాయతీలలో నిధులు కరువయ్యాయి. కొత్తగా ఏర్పాటైన గిరిజన పంచాయతీల్లో అప్పట్లో ట్రాక్టర్ల రుణాల ఈఎంఐలు చెల్లించడానికి సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదలైనట్లు ప్రభుత్వం ప్రకటించినా ఇంకా అనేక పంచాయతీ ఖాతాల్లో జమ కాలేదని మాజీ సర్పంచులు వాపోతున్నారు. మరోవైపు ప్రజలకు ప్రత్యేకాధికారులు అందుబాటులో లేకపోవడం మూలంగా పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ప్రస్తుతం నియమితులైన ప్రత్యేకాధికారులు తమ శాఖల పనులకే పరిమితమవుతూ సభలు, సమావేశాలకు మాత్రం హాజరవుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

వార్డు మ్యాపింగ్, ఓటరు జాబితాపై శిక్షణ

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం కార్యాచరణ పారంభించింది. ఇందుకోసం వార్డుల మ్యాపింగ్, ఓటరు జాబితా తయారీపై డాటా ఎంట్రీ ఆపరేటర్లకు అధికారులు శిక్షణ ఇచ్చారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి పోలింగుకు కొన్ని నెలల ముందే ఓటరు జాబితా సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. పంచాయతీ ఎన్నికల ఓటర్ల జాబితా రూపకల్పనకు ఉమ్మడి జిల్లా నుంచి 15 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను ఎంపికచేసి శిక్షణ ఇప్పించారు. ముందుగా వార్డుల మ్యాపింగ్, వార్డులవారీగా ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియపై అవగాహన కల్పించారు. వీరు రూపొందించిన జాబితాను జిల్లా అధికారులు పరిశీలించి ఓటరు తుది జాబితా వెల్లడిస్తారు.

పాత రిజర్వేషన్లేనా?

గత ప్రభుత్వం పంచాయతీల్లో రిజర్వేషన్ల గడువు పది సంవత్సరాలకు పెంచుతూ చట్టం చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టిన అనంతరం, వాటి ఆధారంగానే రిజర్వేషన్లలో మార్పులు తీసుకురావాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఈ ప్రక్రియ వ్యయ ప్రయాసలతో కూడుకొని ఉండడం, సమయాభావం కారణంగా పాత రిజర్వేషన్ల ఆధారంగానే ఎన్నికలు జరుగుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం	
పంచాయతీలు	1,615
సిద్దిపేట	499
సంగారెడ్డి	647
మెదక్	469
మొత్తం వార్డులు	14,336
సిద్దిపేట	4,476
సంగారెడ్డి	5,778
మెదక్	4,082

ఖంజర్ ఖేర్వా గ్యాంగ్ ఆటకట్టు

- రూ.3.10 కోట్ల విలువైన బంగారం స్వాధీనం
- జూలై 27న చోరీ.. పది రోజుల్లోనే ఛేదించిన పోలీసులు
- ప్రధాన నిందితుడు అరెస్ట్.. మరో ముగ్గురు పరారీ





పట్టుబడిన బంగారాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

జహీరాబాద్, ఆగస్టు 5: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ శివారులోని కోహీనూర్ దాబా వద్ద ఈ నెల 27న అర్ధరాత్రి సమయంలో ట్రావెల్ బస్సులో బంగారం దోపిడికి పాల్పడిన ఖంజర్‌ఖేర్వా ముఠాలోని కీలక సభ్యుడిని ఎస్‌వోటీ, జహీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా కీర్యాజాగీర్ దార్వార్‌పుకు చెందిన ముఠా నుంచి రూ. 3.10 కోట్ల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఖంజార్ ఖేర్వా పేరుతో ఈ ముఠా దోపిడీలకు పాల్పడుతోందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం ఆయన మీడియాకు వివరించారు. ఈ ఏడాది జూలై 27న ముంబాయికి చెందిన నగల వ్యాపారి ఆశీష్ జైన్ 4.08 కిలోల బంగారు ఆభరణాలను హైదరాబాద్‌కు తీసుకువచ్చి అక్కడ 1.08 కిలోల బంగారు ఆభరణాలను విక్రయించాడు. మిగిలిన 2.900 కిలోల బంగారు ఆభరణాలను తిరిగి ముంబాయికి ట్రావెల్ బస్సులో తీసుకువెళ్తున్నాడు. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని సత్వార్ గ్రామ శివారులో గల కోహీనూర్ దాబా వద్ద టీ, స్నాక్స్‌ను తీసుకోవడానికి కిందకు దిగాడు. తిరిగి బస్సు ఎక్కిన తర్వాత చూసుకుంటే ఆభరణాలు ఉన్న బ్యాగ్ కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం, సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు. చోరీ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని సుమారు వంద కిలోమీటర్ల మేర సీసీ కెమెరాలను పరిశీలించారు. దొంగతనానికి పాల్పడిన వారు సీజీ04-హెచ్‌డీ9765 అనే కారును వినియోగించినట్లు గుర్తించారు. చోరీ చేసింది మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా క్వీరాజాగీర్ దార్వార్‌పురకు చెందిన ఖంజర్‌ఖేర్వా గ్యాంగు సభ్యులని గుర్తించారు. మాసూమ్ అలియాస్ ముస్తాఖ్‌ఖాన్, అష్రాఫ్, ఫేరోజ్, సాజిద్‌లు ముఠాగా ఏర్పడి ట్రావెల్ బస్సులను టార్గెట్ చేస్తూ దోపిడీలకు పాల్పడుతుంటారని పోలీసుల పరిశీలనలో తేలింది.

వాహనాల తనిఖీలో..

మండలంలోని బూడ్దిపాడ్ చౌరస్తా వద్ద సోమవారం ఉదయం పోలీసులు బృందాలుగా ఏర్పడి వాహన తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో సీజీ04-హెచ్‌డీ9765 నంబర్ గల కారులో నిందితులు మాసూమ్ అలియాస్ ముస్తాఖ్‌ఖాన్, అష్రాఫ్, ఫేరోజ్, సాజిద్‌లు ప్రయాణిస్తున్నారు. అనుమానం వచ్చి కారును ఆపి, మాసూమ్ అలియాస్ ముస్తాఖ్‌ఖాన్‌ను పట్టుకుని ప్రశ్నించగా, చోరీ వివరాలు వెల్లడించారు. మరోమారు దొంగతనం చేసి, గతంలో దొంగలించిన బంగారంతో పాటు కొత్తగా దొంగతనంలో వచ్చే బంగారం అమ్మేందుకు పథకం వేసుకున్నామని నిందితుడు చెప్పాడని పోలీసులు తెలిపారు. అయితే, ముఠాలోని అష్రాఫ్, ఫేరోజ్, సాజిద్‌లు పరారయ్యారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. మూడు బృందాలుగా ఏర్పడి చోరీ కేసును ఛేదించిన జహీరాబాద్, సీసీఎస్ పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, పట్టణ సీఐ శివలింగం, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ మల్లేశం, సీసీఎస్ ఎస్‌ఐ శ్రీకాంత్, జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐ. ప్రసాదరావు, చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజిరెడ్డి, హద్నూర్ ఎస్‌ఐ రామానాయుడు, పోలీస్ సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించి, నగదు రివార్డు అందజేశారు.



ఆడేదెలా?

ఎవరికీ పట్టని అంబేడ్కర్ స్టేడియం

- ఏళ్లుగా ఆధునికీకరణకు నోచుకోని వైనం
- కోచ్‌లు, క్రీడా సామగ్రి లేక 'ఆట'లకు ఆటంకం
- కూలుతున్న ప్రహరీ.. వసతులు, సౌకర్యాలు కరువు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 5 : జిల్లాకేంద్రమైన సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో అభివృద్ధి ఎవరికి పట్టడం లేదు. జిల్లా కలెక్టర్ నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ స్టేడియం కనీసం ఆధునీకరణ, మరమ్మతులకు నోచుకోవడం లేదు. క్రీడల నిర్వహణతో పాటు ఈ స్టేడియం అభివృద్ధికి గత పదిహేనేళ్లుగా నయాపైసా కూడా ప్రభుత్వం నుంచి మంజూరు కాకపోవడం పాలకులకు క్రీడలు, క్రీడాకారులపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం. ఫలితంగా 'ఆట'లకు ఆటంకం ఏర్పడుతున్నది. ఇక్కడ సాధనకు వచ్చే క్రీడాకారులకు సౌకర్యాలు కూడా అందడం లేదు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉన్న ఈ స్టేడియంలో కోచ్‌లు లేరు. క్రీడాకారులకు సరిపడా క్రీడా సామగ్రి లేదు. క్రీడాకారులు, వాకర్స్‌కు తాగేందుకు నీరు లేవు. మూత్రశాలలు నిరుపయోగంగా మారాయి. ఓవైపు క్రీడా శిక్షకులు లేకపోవడం, మరోవైపు స్టేడియంలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో క్రీడాకారులు నిరాశ చెందుతున్నారు. క్రీడాకారులు కూర్చునే గ్యాలరీ దెబ్బతిన్నది. స్టేడియంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత, గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక స్టేడియం ప్రహరీ కూలిపోయి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నదని క్రీడా సంఘాలు, క్రీడాకారులు వాపోతున్నారు. 2012లో ఈ స్టేడియం ప్రాంగణంలోనే ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు చేపట్టినా వివిధ కారణాలతో పిల్లర్ల స్థాయిలోనే అర్ధాంతరంగా నిలిపోయింది. సరైన సౌకర్యాలు లేకపోవడంతో రాష్ట్ర, జిల్లాస్థాయి వివిధ క్రీడాంశాల పోటీలకు సంబంధించిన ఎంపికలు నామమాత్రంగా కానిచ్చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మొత్తంగా ఈ స్టేడియం అభివృద్ధి పడకేయడంతో ఆటలకు ఆటంకంగా మారిందని పేర్కొనవచ్చు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, కలెక్టర్ దృష్టిసారించి అంబేడ్కర్ స్టేడియం అభివృద్ధి, ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు కోరుతున్నారు.





ధ్వంసమైన స్టేడియం ప్రహరీ



చూసేదేమిటో.. చేసేదేమిటో..!



- పదవీ కాలం ముగిసేముందు అధ్యాయనమట!
- స్టడీ టూర్ పేరిట చండీగఢ్‌కు సదాశివపేట కౌన్సిలర్లు
- మహిళా కౌన్సిలర్లకు బదులు భర్తలు, కుమారులు
- టూర్‌కు ఓ వర్గం ప్రజాప్రతినిధులు దూరం
- ఇప్పుడు వెళ్లి ఏం చేస్తారని విమర్శలు

సదాశివపేట, ఆగస్టు 5: ఐదు నెలల్లో మున్సిపాలిటీ పాలకవర్గాల పదవీ కాలం ముగియనున్న తరుణంలో సభ్యులు స్టడీటూర్ పేరిట విహారానికి వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చులు, దుబారాలను తగ్గించాలని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు హెచ్చరికలను జారీచేసింది. కానీ, సదాశివపేట బల్దియాలో మాత్రం కొందరు కౌన్సిలర్లు మాత్రమే అత్యవసరంగా విమానాలు ఎక్కి మాస్టర్‌ప్లాన్‌పై అధ్యాయనం చేసేందుకు చండీగఢ్ వెళ్లారు. మహిళా కౌన్సిలర్లకు బదులు వారి భర్తలు, కుమారులు స్టడీటూర్‌కు వెళ్లడం మరో చోద్యం. నాలుగున్నర సంవత్సరాలుగా లేనిది ఇప్పుడు అధ్యయనం చేసిన విషయాలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నా పట్టించుకోలేదు.

బల్దియా ఖజానాకు చిల్లు

బల్దియాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధ్యయనం చేసేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు మున్సిపాలిటీలకు అధికారం ఉంటుంది. కానీ, సదాశివపేటలో మాత్రం పదవీకాలం ముగిసే ముందు కొంతమంది కౌన్సిలర్ల బృందం మాత్రమే.. ఒకేఒక్క అధికారి తోడురాగా స్టడీటూర్‌కు వెళ్లారు. ఇందుకోసం బల్దియా సాధారణ నిధుల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు పెట్టడానికి ఆమోదించారు. స్టడీటూర్‌కి పార్టీలకతీతంగా కౌన్సిలర్లందరూ వెళ్లాలి. కానీ, ఇక్కడ మాత్రం స్టడీటూర్‌కు ఓ పార్టీకి చెందిన మెజారిటీ కౌన్సిలర్లు దూరంగా ఉండడం గమనార్హం. ప్రజాధనంతో నిర్వహించే అధికారిక స్టడీటూర్‌లో మహిళా కౌన్సిలర్లకు బదులు వారి భర్తలు, కుమారులు వెళ్లడం మరోచోద్యం. మరోవైపు ఈ టూర్ కోసం ఆమోదించిన ఖర్చు కంటే రెట్టింపు వ్యయం చేసేందుకు ప్రణాళికలు వేసుకున్నారని ప్రచారం జరుగుతున్నది. అక్కడికి వెళ్లిన అనంతరం టూర్‌ను పొడగించుకుని ఇతర పట్టణాలకు కూడా వెళ్లే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది.

2041 మాస్టర్‌ప్లాన్ ఊసెత్తకుండానే...

చండీఘడ్ పట్టణంలో అమలవుతున్న మాస్టర్‌ప్లాన్, పారిశుధ్య నిర్వాహణ, తాగునీటి సరఫరా, పట్టణ ప్రణాళికలను అధ్యాయనం చేసి, ఇక్కడ అమలు చేయాలనేది స్టడీటూర్ లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. అయితే, ఎన్నో సంవత్సరాలుగా సదాశివపేట బల్దియాలో 2041 మాస్టర్‌ప్లాన్ అమలు పెండింగ్‌లో ఉన్నది. స్టడీటూర్‌కు వెళ్లిన ప్రజాప్రతినిధులు స్థానికంగా ప్రతిపాదించిన మాస్టర్‌ప్లాన్ అమలుపై నాలుగేళ్లుగా ఎలాంటి చర్చ.. తీర్మానం చేయలేదు. పదవీ కాలం ముగిసే ముందు పక్క రాష్ట్రాల్లో అమలవుతున్న మాస్టర్‌ప్లాన్, అభివృద్ధి ప్రణాళికలను అధ్యాయనం చేసేందుకు టూర్ వెళ్లడం ప్రజాధనం దుర్వినియోగం చేయడమేనని పలువురు ఆరోపిస్తున్నారు.

> **అధికారికంగానే..**
>
> కౌన్సిలర్లు స్టడీటూర్‌కు అధికారికంగానే వెళ్లారు. ఇందుకోసం ముందస్తుగా మున్సిపాలిటీ నుంచి ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం స్టడీటూర్ ఖర్చులకు సంబంధించిన బిల్లులు చెల్లించడంపై నిర్ణయం తీసుకుంటాం.
>
> -జె.ఉమ, సదాశివ పేట మున్సిపల్ కమిషనర్

ప్రజావాణికి పోటెత్తిన జనం

- భూ సమస్యలు, ఫించన్లు, రుణమాఫీ, ఇళ్ల కోసం అర్జీలు
- మెదక్‌లో 226 దరఖాస్తులతో రికార్డ్



మెదక్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ అర్బన్, ఆగస్టు 5: సమస్యల పరిష్కారం కోసం తరలివచ్చిన అర్జీదారులతో మెదక్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి పోటెత్తింది. భూ సమస్యలు పరిష్కరించాలని.. పెన్షన్లు రావడం లేదని.. రుణమాఫీ కావడం లేదని.. ఇళ్లు ఇవ్వాలని.. ఇలా పలు సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు అర్జీలు అందజేశారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల జిల్లా అధికారులు అర్జీలను స్వీకరించారు. ప్రజలను నుంచి రికార్డుస్థాయిలో మొత్తం 226 దరఖాస్తులు రాగా.. ఇందులో భూ సమస్యలు 50, పెన్షన్లు 45, రుణమాఫీ 40, డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం 30, ఉపాధి 5, ఇతర సమస్యలకు సంబంధించిన 56 అర్జీలు ఉన్నాయి. ప్రజావాణి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు.


సంగారెడ్డిలో 75 దరఖాస్తులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. అర్జీదారుల నుంచి జిల్లా అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి 75 దరఖాస్తులు రాగా, రెవెన్యూ శాఖకు చెందినవి 21 దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని 502, 389 సర్వే నంబర్లలో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన గడీల సురేష్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. రీజినల్ రింగురోడ్డు కోసం భూములు కోల్పోతున్న వారికి మార్కెట్ ధర చెల్లించాలని చింతలపల్లి గ్రామ రైతులు విన్నవించారు.























భర్తతో గొడవ పడి..

ఇద్దరు పిల్లలతో సహా భార్య అదృశ్యం




పిల్లలతో శ్రీలత(ఫైల్)

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 5 : కుటుంబ సమస్యల విషయంలో భర్తతో గొడవ పడి ఇద్దరు పిల్లలతో సహా భార్య అదృశ్యమైన ఘటన సంగారెడ్డి పట్టణంలో చోటుచేసుకున్నది. పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయికోడ్ మండల కేంద్రానికి చెందిన మంగలి వెంకటేశ్ తన భార్య శ్రీలత(30), ఇద్దరు పిల్లలు సరస్వతి(5), సాత్విక్(4)లతో కలిసి బతుకుదెరువు కోసం సంగారెడ్డికి వచ్చి ప్రగతినగర్‌లో ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. వెంకటేష్ సెలూన్‌షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం శ్రీలత భర్త వెంకటేష్‌తో గొడవ పడింది. భర్త ఇంట్లో లేని సమయంలో ఇద్దరు పిల్లలను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. వెంకటేష్ ఇంటి చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ భాస్కర్ తెలిపారు. శ్రీలత, సరస్వతి, సాత్విక్ గురించి తెలిస్తే 8712661830 లేదా 8712656718 నంబర్లకు ఫోన్‌చేయాలని సీఐ సూచించారు.

ఉపాధి కూలీల హక్కులను పరిరక్షించండి

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శికి నరేగా బృందం వినతి

గజ్వేల్, ఆగస్టు 5: ఉపాధిహామీ కూలీల హక్కులను పరిరక్షించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేష్‌కుమార్‌సింగ్‌కు నరేగా బృందం సభ్యులు విన్నవించారు. ఢిల్లీ కృషిభవన్‌లోని కేంద్ర కార్యాలయంలో వివిధ రాష్ట్రాలకు చెందిన దళిత, ప్రజా, కార్మిక సంఘాలకు చెందిన 15మంది బృందం సభ్యులు సుదీర్ఘంగా ఆయా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ ఉపాధి కూలీల జాబ్‌కార్డులను తొలగింపు అన్యాయమని, ఈ ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. తెలంగాణలో ఐదు లక్షలకుపైగా జాబ్‌కార్డులను తొలగించారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.





కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

● అత్తింటి వారే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు

● న్యాయం చేయాలని పీఎస్ ఎదుట మృతుడి బంధువుల ఆందోళన

చిన్నశంకరంపేట, ఆగస్టు 5 : కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకోగా చిన్నశంకరంపేట మండలంలోని మలుపల్లి గ్రామంలో సోమవారం ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. వివరాల్లోకి వెళితేగ్రామానికి చెందిన చిటుకుల నర్సింహులుకు ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురు ప్రవళికకు నిజామాబాద్ జిల్లా ధర్మారం గ్రామానికి చెందిన ఉదయ్ కిరణ్‌తో 12 ఏళ్ల క్రితం వివాహం కాగా, ఇల్లరికం వచ్చారు. కొన్ని నెలల నుంచి వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. వారం రోజులక్రితం ఉదయ్‌కిరణ్ కుటుంబసభ్యులను కొట్టాడని ప్రవళిక పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తల్లి రాణికి పోలీసులు కిరణ్‌ను అప్పగించారు. ఆదివారం ఉదయం మలుపల్లి గ్రామ డంపుయార్డులో ఉదయ్‌కిరణ్ ఉరేసుకుని కనిపించాడు. ఉదయ్‌కిరణ్‌ను పథకం ప్రకారం హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని అతడి తల్లి రాణి, బంధువులు ఆరోపించారు. అత్తగారింటి ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆదివారం పోస్టుమార్టం చేసిన డెడ్ బాడిని మృతుని కుటుంబీకులకు అప్పగించకుండా అలస్యం చేశారు. అనుమానం వ్యక్తం చేసిన ఉదయ్‌కిరణ్ బంధువులు పోలీస్‌స్టేషన్ ఎదుట చేగుంట-మెదక్ రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. న్యాయం జరిగేవరకు ఆందోళన విరమించబోమని భీష్మించుక్కూర్చున్నారు. మృతుడి శరీరంపై గాయాలు ఉన్నాయని, హత్యకు కారకులైన వారిని పోలీసులు కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్, చేగుంట ఎస్ఐ బాల్‌రాజు ఆందోళనకారులను సముదాయించారు. మృతదేహాన్ని రీపోస్టుమార్టం చేయాలని ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్ సాయంత్రం మలుపల్లిని సందర్శించి మృతుడి ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. అత్తింటి వారే హత్య చేసినట్లు బంధువులు, గ్రామస్థులు ఆరోపించగా కొంతమంది గ్రామ పెద్దలు, బాధితులను మెదక్ మార్చురికి తీసుకెళ్లారు. మృతదేహాన్ని చూపించగా ఎలాంటి గాయాలు లేనట్లు సీఐ తెలిపారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి పోస్టుమార్టం రిపోర్టు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు. గ్రామంలోనే పోలీసుల పర్యవేక్షణలో మృతుడి అంత్యక్రియలను పూర్తిచేశారు.


చేగుంట - మెదక్ రహదారిపై బైఠాయించిన మృతుడి బంధువులు



హైవేలపై టెర్రర్

నెత్తురోడుతున్న 161, 65వ నంబర్ జాతీయరహదారులు

● నిండు ప్రాణాలను మింగేస్తున్న అతివేగం

● కనిపించని నాందేడ్-అకోలా రహదారి సర్వీస్ రోడ్లు

● సంగారెడ్డి నుంచి జహీరాబాద్ దారిలో దాబాలతో ట్రాఫిక్


కంది మండలం మామిడిపల్లి వద్ద 161 హైవేపై ప్రమాదంలో ముగ్గురు యువకుల మృతి(ఫైల్)

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 5 : జిల్లాలోని జాతీయ రహదారులు నెత్తురోడుతున్నాయి. వాహనాల అతివేగం, వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతున్నాయి. రోడ్డు నిబంధనలు పాటించకుండా వాహనదారులు ఇష్టారీతిగా వాహనాలు నడుపుతున్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని పోలీసులు ఓ వైపు హెచ్చరిస్తూ వాహన తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నప్పటికీ వాహన చోదకుల్లో మాత్రం మార్పు రావడం లేదు.

నాందేడ్ - అకోలా హైవే రక్తసిక్తం

సంగారెడ్డి- నాందేడ్-అకోలా 161 జాతీయ రహదారిని ఇటీవలే కొత్తగా విస్తరించారు. కానీ కొన్ని ప్రాంతాల్లో సర్వీస్ రోడ్లు లేకపోవడం, ఫ్లైఓవర్ లేకపోవడం వల్ల ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు దాటుతున్న క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. అందోల్, చౌటకూరు, పుల్కల్ మండల పరిధిలోని పలు గ్రామాల వద్ద సర్వీస్ రోడ్లు సరిగ్గా లేవు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్డుపైకి రావాలంటేనే జంకుతున్నారు. అందోల్ మండలం డాకూరు శివారులో ఫిబ్రవరి 26వ తేదీన రోడ్డుపై నిల్చున్న వారిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా పలువురికి గాయాలయ్యాయి. తాజాగా జూలై 25వ తేదీ తెల్లవారుజామున కంది మండలం మామిడిపల్లి వద్ద 161 జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులు టాటా కంటైనర్‌ను ఢీకొట్టడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందారు. యువకులంతా పుల్కల్ మండలం గొంగ్లూర్, గంగోజిపేటకు చెందిన వారు. జిల్లా పోలీసుల గణాంకాల ప్రకారం... ఈ సంవత్సరం జూలై నెలాఖరు వరకు మొత్తం 492 రోడ్డు ప్రమాదాలు జరుగగా 199 మంది మృత్యువాత పడగా 574 మంది క్షతగాత్రులయ్యారు.

65వ నంబరుపై యాక్సిడెంట్ స్పాట్లు

65వ నంబరు జాతీయ రహదారిపై ఎంతో అప్రమత్తంగా ఉంటేనే గమ్యస్థానాన్ని సురక్షితంగా చేరుకోగలం. ఈ జాతీయ రహదారి హైదరాబాద్-ముంబయి ప్రధాన రహదారి కావడంతో రోజూ భారీ వాహనాలు వేల సంఖ్యలో తిరుగుతుంటాయి. ముఖ్యంగా షిర్డీకి ప్రైవేట్ ట్రావెల్స్ ఎక్కువగా వెళ్తుంటాయి. ఈ దారిగుండా ముంబయికి వాహనాల రాకపోకలు ఎక్కువగానే ఉంటాయి. ప్రస్తుతం ఈ రోడ్డును ఆరులేన్లుగా విస్తరిస్తున్నారు. దీంతో సాయంత్రం ఈ రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించిపోతోంది. సంగారెడ్డి నుంచి జహీరాబాద్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా దాబాలు ఉన్నాయి. కొన్ని దాబాలలో సిట్టింగ్‌లు కూడా నిర్వహిస్తుండటంతో మద్యం సేవించి వాహనాలను నడుపుతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ జాతీయ రహదారిపై మల్కాపూర్, పెద్దాపూర్, సదాశివపేట, బుదేరా, కంకోల్, జహీరాబాద్ తదితర ప్రాంతాలను జిల్లా పోలీసులు యాక్సిడెంట్ స్పాట్లుగా గుర్తించారు. ఈ రహదారి పక్కనే ఉన్న గ్రామాల ప్రజలు రాత్రివేళల్లో రోడ్డు మీదుకు రావాలంటేనే జంకుతున్నారు. భారీ వాహనాల అతివేగం, అజాగ్రత్త కారణంగా వేలాది మంది అమాయక ప్రజలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు.

హైవే పక్కనే భారీ వాహనాల పార్కింగ్

సంగారెడ్డి జిల్లాలోని 65వ నంబరు, 161వ నంబరు జాతీయ రహదారుల పక్కన పెట్రోల్ బంకుల వద్ద భారీ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రహదారుల పక్కన అనధికారికంగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల దారులు అతి వేగంగా వెళ్తూ రోడ్డు పక్కనే పార్కింగ్ చేసి ఉన్న భారీ వాహనాలను చూసుకోకపోవడం వల్ల వెనుకవైపు నుంచి ఢీకొడుతున్నారు. రాత్రి వేళల్లో అయితే మరీ ప్రమాదకరంగా మారుతున్నాయి. గంటల తరబడి భారీ వాహనాలు జాతీయ రహదారుల పక్కన పార్కింగ్ చేస్తున్న విషయాన్ని జిల్లా పోలీసులు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుతున్నారు.

నాలుగేళ్ల కాలంలో జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలు

సంవత్సరం	2021	2022	2023	2024 (జూలై వరకు)
ప్రమాదాలు	729	798	807	492
మృతులు	433	466	411	199
క్షతగాత్రులు	655	754	774	574

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అతివేగం, మద్యం సేవించి వాహనాలను నడపడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. జాతీయ రహదారులపై వాహనాలను జాగ్రత్తగా నడపాలి. అతివేగం, నిర్లక్ష్యం ప్రదర్శించకూడదు. హైవేలపై అవసరం లేని చోట యూటర్న్‌లను మూసివేశాం.

- చెన్నూరి రూపేష్, సంగారెడ్డి జిల్లా ఎస్పీ

ఇల్లు చక్కబెట్టనోళ్లు గ్రామాన్ని శుభ్రంగా ఎలా ఉంచుతారు?

● టేక్మాల్ పంచాయతీ అధికారిపై మెదక్ కలెక్టర్ మండిపాటు

టేక్మాల్ ఆగస్టు 5: ఇల్లు చక్కబెట్టనోళ్ల గ్రామాన్ని ఏం పరిశుభ్రంగా ఉంచుతారని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ టేక్మాల్ పంచాయతీ అధికారులపై మండిపడ్డారు. సోమవారం ఆయన టేక్మాల్, బొడ్మాట్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పురవిధుల గుండా తిరుగారు. టేక్మాల్ బస్టాండ్ ఆవరణలో గుంతల్లో మట్టి పోయించలేదని పంచాయతీ కార్యదర్శిపై మండిపడ్డారు. పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్, ఇతర సామగ్రిలో నీరు నిల్వ ఉండడంతో దోమలు ఆవాసం చేస్తున్నాయని, పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించి, మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్నం భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొడ్మాట్‌పల్లి గ్రామంలోని హెల్త్‌క్యాంప్‌ను సందర్శించారు. పాఠశాలలో మొక్కలు నాటారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో రియాజోద్దీన్, ఏపీవో పొలు, ఏపీఎం రామకృష్ణ, నాయకులు ఉన్నారు.



టేక్మాల్‌లో నిర్వహించిన ర్యాలీలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆరుబయట చెత్త వేస్తే అనర్థాలు

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 5 : ఆరు బయట చెత్తను వేయడం వల్లనే అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం పట్టణంలోని 33వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవి అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోయడం ద్వారా దోమలు వ్యాపించి సీజనల్ వ్యాధులతో పాటు కుక్కలు, పందులు స్వైర విహారం వల్ల అనేక రకాల సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మునిసిపాలిటీ వాహనాల్లోనే చెత్తను వేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం పెంపొందించడం కోసం ఐదు రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మొక్కను నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా స్వచ్ఛదనం-పచ్చదనం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనదపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, వార్డు కౌన్సిలర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని బీసీ గురుకుల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని వంటశాలలను, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల ఆసక్తి, అభిరుచులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆర్‌సీవో ప్రభాకర్, ప్రిన్సిపాళ్లు రజని, సంతోష్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.


మొక్కను నాటుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

నిషేధిత జాబితాలోని భూములకు పాసుబుక్‌లు ఎలా ఇస్తారు?

● ప్రజావాణిలో లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ ఫిర్యాదు

రామచంద్రాపురం, ఆగస్టు 5 : నిషేధిత జాబితాలోని భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఎలా జారీ చేస్తారని కొల్లూరు లక్ష్మీపురం ప్లాట్‌ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రశ్నించారు. సోమవారం వారు రెవెన్యూ కార్యాలయంలో జరిగే ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని చిరువ్యాపారులు, ఉద్యోగులు 1984వ సంవత్సరంలో కొల్లూరులోని సర్వేనంబర్లు 174 నుంచి 190లలో వేసిన లే అవుట్‌లో ప్లాట్లలను కొనుగోలు చేశారన్నారు. అప్పట్లో కొందరి మూలంగా సమస్య ఏర్పడిందని చెప్పారు. అప్పటి నుంచి ఈ సర్వే నంబరులలో ఎవరికి పాసుబుక్కులు ఇవ్వకుండా పోరాటాలు చేస్తున్నామన్నారు. కొందరు లబ్ధిదారులు ప్రాణాలు పోగొట్టుకోగా వారి వారసులు ప్లాట్ల కోసం ఉద్యమిస్తున్నారని చెప్పారు. లోకాయుక్త తమకు అనుకూలంగా నివేదిక ఇచ్చిందన్నారు. అయినా, అధికారులు వారం రోజుల క్రితం సుమారు 30 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించారని, ఈ భూమిలో ఎవరికి పాసుపుస్తకాలు జారీ చేయవద్దంటూ తహసీల్దార్ సంగ్రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సత్తయ్య మూర్తి, రామ్మోహన్, సురేంద్ర, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నవోదయ విద్యాలయంలో అథ్లెటిక్ మీట్

● రెండు రోజుల పాటు క్రీడా పోటీలు

● పాల్గొననున్న తొమ్మిది జిల్లాల విద్యార్థులు


నవోదయ విద్యాలయంలో క్రీడా మైదానాన్ని సిద్ధం చేస్తున్న విద్యార్థులు

వర్గల్, ఆగస్టు 5 : వర్గల్ కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో బుధ, గురువారాల్లో క్లస్టర్ లెవల్ అథ్లెటిక్ మీట్‌ను నిర్వహించనున్నారు. విద్యాలయం ప్రాంగణం, క్రీడామైదానాలను అథ్లెటిక్ పోటీల కోసం సిద్ధం చేస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని తొమ్మిది నవోదయ విద్యాలయాల నుంచి సుమారు వంద మంది పాల్గొనున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఈ అథ్లెటిక్ మీట్‌లో ఎంపికైన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలోని నవోదయ విద్యాలయంలో ఈనెల 12, 13 తేదీల్లో జరిగే ప్రాంతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ వివరించారు.

చదువుకు పేదరికం అడ్డు కాకూడదు : చక్రధర్‌గౌడ్

● బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన 22 మందికి ఆర్థిక సహాయం

నంగునూరు, ఆగస్టు 5 : చదువుకు పేదరికం అడ్డుకాకూడదని, నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని ఫార్మర్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు గాదగోని చక్రధర్‌గౌడ్ అన్నారు. సోమవారం నంగునూరు ఉన్నత పాఠశాలలో బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన 22మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. నైపుణ్యం గల అధ్యాపకులతో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను చదివిన అనేకమంది ఉన్నత పదవులు ఉన్నారని గుర్తుచేశారు. నిరుపేద విద్యార్థుల కోసం తమ ఫార్మర్స్ ఫౌండేషన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ఎవరైనా పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఆర్థికంగా ఇబ్బంది ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామిగౌడ్, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్

పశువులకు సకాలంలో వైద్యం అందించాలి

● సరిపోను వైద్య సిబ్బందిని నియమించాలని రైతుల ఆందోళన


కంది, ఆగస్టు 5 : పశువులకు, గొర్రెలకు, మేకలకు, పెంపుడు జంతువులకు సకాలంలో వైద్యం అందడంలేదంటూ మండలంలోని పలు గ్రామాల రైతులు సోమవారం కందిలోని ప్రాథమిక పశువైద్య కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. కాశీపూర్, చేర్యాల, మామిడిపల్లి, కంది తండా, ఎర్దనూర్ తండా, వడ్డెన గూడ తండాల రైతులు పశువైద్య కేంద్రానికి చేరుకుని సరిపోను వైద్య సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈనెల 1వ తేదీన పశు వైద్యాధికారులు బదిలీ అయినప్పటి నుంచి గ్రామాల్లో పశు వైద్య సేవలు నిలిచిపోయాయని రైతులు ఆరోపిస్తున్నారు. కంది మండలంలోని 22 గ్రామాల్లో కలిపి దాదాపు 5వేలకు పైచిలుకు పశువులు, 11 వేలకుపైగా మేకలు, గొర్రెలు ఉన్నట్లు సమాచారం. అయితే కందిలో ఒక్క మహిళ వెటర్నరీ డాక్టర్‌ను మాత్రమే నియమించారు. ఆమె కూడ ఉదయం 11 గంటలు దాటినా విధులకు హాజరుకావడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. అంతేగాక గ్రామాల్లో తిరిగి వైద్యం చేయడానికి పశువైద్య సహాయకులను ఒక్కరినీ నియమించలేదు. ఉన్న మహిళా వెటర్నిటీ డాక్టర్ కూడా వారానికి మూడు రోజులు కోహీర్ మండలంలో, మరో మూడు రోజులు కంది మండలంలో విధులు నిర్వహిస్తున్నట్టు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి తెలిపారు. తమ పశువులు ఈ వర్షాకాలంలో ఎక్కువగా జబ్బుల బారిన పడతాయని, వాటికి సకాలంలో వైద్యం అందించకపోతే పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందని రైతులు బెంబేలెత్తుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని అన్ని గ్రామాలకు సరిపడా పశువైద్య సిబ్బందిని నియమించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.


కంది పశువైద్య కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

● ఆర్డీవో కార్యాలయం ఎదుట పోతారం(ఎస్)కు చెందిన బాధితుల ఆమరణ నిరాహార దీక్ష

● ఒకరి ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రికి తరలింపు


ఆమరణ దీక్షలో బాధిత రైతులు

హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 5 : కబ్జాకాలంలో ఉన్న తమని కాదని ధరణి పోర్టల్ ద్వారా అక్రమంగా పట్టా చేసుకుని అన్యాయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోతారం(ఎస్) గ్రామానికి చెందిన 12 దళిత కుటుంబాలు డిమాండ్ చేస్తున్నాయి. సోమవారం బాధితులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. పోతారం(ఎస్) గ్రామ శివారులో ఉన్న భూములను తమ తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్నామని, వాటిని ఇతరులకు పట్టాలు చేసి అన్యాయం చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ఇదే విషయంపై ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టామని, అప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఉండవని హామీ ఇచ్చి ప్రస్తుతం పట్టా చేశారని మండిపడ్డారు. న్యాయం జరిగే వరకు ఆర్డీవో కార్యాలయం ఎదుట దీక్ష కొనసాగిస్తామని తెలిపారు. బాధితుడైన వెంకటేశ్ సాయంత్రం ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. గమనించిన మిగతా వారు ఆయనను ఆస్పత్రికి తరలించారు.

ఖాతాదారులకు ఉత్తమ సేవలందించాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఆగస్టు 5: ఖాతాదారులకు ఉత్తమ సేవలందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ బ్యాంక్ బ్రాంచ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది నూతన ఎస్‌బీఐ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. కొత్తగా ప్రారంభించిన ఎస్‌బీఐ బ్యాంకు మెదక్ జిల్లాలో 19వ శాఖ అని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ అరుణజ్యోతి తెలిపారు. కార్యక్రమలో జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ నరసింహమూర్తి, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

● మెదక్ అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, ఆగస్టు 5: పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలు ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు.

తొలిరోజు అట్టహాసంగా 'స్వచ్ఛదనం-పచ్చదనం'

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛదనం- పచ్చదనం'ను సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఆయా గ్రామాలు, మున్సిపల్ పరిధిలో ఈ నెల 9వ తేదీ వరకు 5 రోజుల పాటు నిర్దేశించినవిధంగా వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఈ సందర్భంగా తొలిరోజు ఆయా గ్రామాలు, మున్సిపల్ పరిధిలో అధికారులు ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంపై అవగాహన కల్పించి, మొక్కలు నాటే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలుచోట్ల విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు.



జోగిపేట: మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబ



హత్నూర: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



పెద్దశంకరంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

జోగిపేట, ఆగస్టు 5: పరిశుభ్రతతోనే వ్యాధులు, రోగాలకు దూరంగా ఉండొచ్చని సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా పేర్కొన్నారు. సోమవారం ఆయన, మండలంలోని డాకూరు గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో మాట్లాడుతూ.. వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఆయన ఆర్డీవో పాండుతో కలిసి గ్రామంలోని పలు వీధుల్లో తిరిగి శ్రమదానం చేశారు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

● కంది : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లోని పంచాయతీల్లో డ్వాక్రా సంఘాలు, ఆశా వర్కర్లతో పరిశుభ్రతపై సమావేశాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించారు.

● వట్‌పల్లి, ఆగస్టు 5 : మండలకేంద్రంలో సోమవారం స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకట్ పాటిల్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● పుల్‌కల్, ఆగస్టు 5: ఉమ్మడి పుల్కల్ మండలంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. సుల్తాన్‌పూర్ గ్రామంలో ఎంపీడీవో ఆనందమేరీ పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. చౌటకూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్‌తో కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల్లో పర్యటించి పారిశుధ్య సిబ్బందికి సూచనలు చేశారు.

● హత్నూర: హత్నూరలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఫర్హీన్‌షేక్, ఎంపీడీవో శంకర్ ఉన్నారు.

● కల్హేర్: కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అధికారులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని మొక్కలు నాటి, ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● సదాశివపేట: పట్టణంలో మున్సిపల్ కమిషనర్ జె.ఉమా ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు.

● కంగ్టి, ఆగస్టు 5: కంగ్టిలో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురుకుల విద్యాలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి మొక్కలు నాటి ఎస్సీ వసతి గృహంలో విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ నూతన్‌కుమార్, ఎంపీడీవో సత్తయ్య, తహసీల్దార్ విష్ణుసాగర్, గురుకుల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

● నాగల్‌గిద్ద: మండలకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక మండల ప్రత్యేక అధికారి బలరాం పాల్గొన్నారు. అనంతరంనాగల్‌గిద్దలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో రాజశేఖర్, వివిధశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● కోహీర్: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లో జిల్లా మత్స్య శాఖ అధికారి సుధాకర్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్డీవో ఎంపీడీ జంగారెడ్డి, ఎంపీడీవో భారతి పాల్గొన్నారు.

● రాయికోడ్: రాయికోడ్‌లోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మండల ప్రత్యేక అధికారి జగదీశ్వర్, ఎంపీడీవో ఎంఎస్ షరీఫ్ పాల్గొన్నారు.

● చేగుంట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని చేగుంట మండల ప్రత్యేక అధికారి బ్రహ్మాజి పేర్కొన్నారు. చేగుంటలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం అధికారులు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. పలు పాఠశాలల ఆవరణలో అధికారులు,ఉపాధ్యాయులు విద్యార్థులు మొక్కలు నాటారు.

● చిన్నశంకరంపేట: మండల కేంద్రంతో పాటు జంగరాయి, శాలిపేట, గజగట్లపల్లి తదితర గ్రామాల్లోని విద్యార్థులతో కలిసి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ర్యాలీలు నిర్వహించి, ప్రజలకు స్వచ్ఛత పచ్చదనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు.

● రేగోడు: మండల కేంద్రంలో సోమవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతారావమ్మ, ఇతర అధికారులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అల్లాదుర్గం: మండలకేంద్రంలో అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల ప్రత్యేక అధికారి కరుణ, ఎంపీడీవో శంకర్ యాదవ్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● పెద్దశంకరంపేట:పెద్దశంకరంపేటలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండలపరిధిలోని బద్దారం, పేట పీహెచ్‌సీలో సైతం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్‌ఉన్నిసా, ఈవో వెంకట రాములు, సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● మాసాయిపేట: మండల కేంద్రంలో సోమవారం మండల స్పెషల్ ఆఫీసర్ జ్ఞానజ్యోతి ఆధ్వర్యంలో గ్రామ సెక్రెటరీ సిబ్బంది విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు మండల కేంద్రంలోని ప్రధాన వీధులతో పాటు పాఠశాల మైదానంలో పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు.

● చిలప్‌చెడ్: మండల కేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై మండల ప్రత్యేక అధికారి మాన్యనాయక్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు అనంతరం గ్రామంలో పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముసాదిక్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● కొల్చారం: మండలంలోని సంగాయిపేట, రాంపూర్‌లో జరిగిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమానికి ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణవేణి హాజరై ప్రజలకు స్వచ్ఛదనం- పచ్చదనంపై అవగాహన కల్పించారు. అలాగే సంగాయిపేట, కొల్చారం గ్రామాల్లో అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. ఎనగండ్ల పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి, డీఈవో రాధాకిషన్ పాల్గొని మొక్కను నాటి నీళ్లుపోశారు.

● వెల్దుర్తి: మండలంలోని మంగళపర్తి, మేల్లూరు గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి పాల్గొని మొక్కలు నాటారు. పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ఇతర ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు.

మున్సిపల్ పరిధిలో...

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 5: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యమివ్వాలని మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్ అన్నారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం 12వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజలతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పారిశుద్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిషనర్ జానకిరాంసాగర్, డీఈ మహేష్, వార్డు ఆఫీసర్లు, శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● నర్సాపూర్: నర్సాపూర్ పట్టణంలో విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ జైతురాంనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సృజన, కౌన్సిలర్లు పాల్గొన్నారు. కాగజ్‌మద్దూర్‌లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

● మనోహరాబాద్/తూప్రాన్: తూప్రాన్ మున్సిపల్ పరిధిలో చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై ర్యాలీ నిర్వహించారు. తూప్రాన్‌లో బస్టాండ్‌వద్దంద మానవహారం ఏర్పాటు చేసి బస్టాండ్ ఆవరణలో శ్రమ దానం చేశారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చైర్‌పర్సన్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినుద్దీన్, కౌన్సిలర్లు, సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. అలాగే మనోహరాబాద్ మండలంలోని గౌతోజీగూడెం, కూచారం, గ్రామాల్లో పచ్చదనం, స్వచ్ఛదనం పై ర్యాలీలు నిర్వహించారు.

● రామాయంపేట: రామాయంపేటలో స్వచ్ఛదనం - పచ్చదనంపై ర్యాలీ నిర్వహించారు. సోమవారం ఉదయం పురవీధుల్లో తిరిగి పరిశుభ్రతపై జనాన్ని చైతన్యపరిచారు. చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ నేతృత్వంలో కమిషనర్ దేవేందర్ సిబ్బంది, ఏఎన్.ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



తూప్రాన్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి, ఆర్డీవో జయచంద్రరెడ్డి



జహీరాబాద్‌లో జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్

● జహీరాబాద్: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో నాయకులు, స్థానిక అధికారులు, గ్రామస్థులు పాల్గొని స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీలు నిర్వహించారు. పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి మెదక్‌జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మొగుడంపల్లి మండలంతోపాటు మాడిగి, ధనసిరి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీ సీఈవో జానకిరెడ్డి పాల్గొన్నారు

● పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీలో పాలకమండలితో కలిసి మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● జిన్నారం: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో పీడీఎంఏ జేడీ నారాయణరావు, మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి పాల్గొన్నారు. బొల్లారంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా 22 వార్డులలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులు స్థానికులకు అవగాహన కల్పించారు. పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

● నారాయణఖేడ్, ఆగస్టు 5: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కనీసం అయిదు మొక్కలను నాటాలని స్థానిక ఎమ్మెల్యేడాక్టర్ పటోళ్ల సంజీవరెడ్డి కోరారు. సోమవారం ఖేడ్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో అధికారులు, విద్యార్థులతో నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఏరియా వైద్యశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆర్డీవో అశోక చక్రవర్తి, డీఎస్పీవెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్‌ఆనంద్‌స్వరూప్ షెట్కార్, కమిషనర్ జగ్జీవన్ పాల్గొన్నారు. ఖేడ్ జడ్పీహెచ్‌ఎస్, స్థానికమైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు.



పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో కార్యక్రమ ప్రారంభోత్సవంలో మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్, మున్సిపల్ చైర్మన్

తల్లిపాలు శిశువుకు అమృతంతో సమానం



సంగారెడ్డి ఎంసీహెచ్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సుధామాధురి


సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 5: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.సుధామాధురి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఎంసీహెచ్‌లో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిశువు పుట్టిన గంటలోపు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మంజీర బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి డా.చక్రపాణి, వివిధ విభాగాధిపతులు డా.షబ్బీర్, డా.రాధిక, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● అల్లాదుర్గం: తల్లిపాలవారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక రైతువేదికలో గర్భిణులకు సామూహిక సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించి తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కరుణ, ఎంపీడీవో శంకర్ యాదవ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

●మాసాయిపేట: మండలంలోని బొమ్మారం గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంతోషిని తల్లిపాల విశిష్టతను గర్భిణులు, మహిళలకు వివరించారు.

● వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు దేవలత, లక్ష్మి, ఏఎన్ఎం అనిత, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.


బైక్‌ల వరుస దొంగతనాలకు పోలీసుల చెక్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లు

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 5: వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను బీడీఎల్ పోలీసులు కటకటాల వెనక్కి పంపారు. సోమవారం పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ స్వామిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం బానూర్ గ్రామంలో ఇంటి ముందు పార్క్ చేసిన మల్లగొని సంతోష్ గౌడ్‌కు చెందిన యమహా బైక్ ఈ నెల 29వ తేదీన రాత్రి చోరీకి గురైంది. బాధితుడు ఉదయం బీడీఎల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనపూర్ చౌరస్తా వద్ద బీడీఎల్ భానూర్ ఇన్‌స్పెక్టర్ స్వామిగౌడ్, ఎస్ఐ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బృందం వాహనాలు తనిఖీ చేపట్టింది. అడ్డగుట్ట, సికింద్రాబాద్ నందనగర్‌కు చెందిన మహమ్మద్ షర్ఫుద్దీన్ అలియాస్ సాహిల్ (19), మల్కాజిగిరికి చెందిన గుడాల తిలక్ అలియాస్ టిల్లు (19), మల్లేపల్లికి చెందిన బైక్ మెకానిక్ మహమ్మద్ ఎస్సా (19)లతో పాటు మరో బాల నేరస్థుడిని అనుమానాస్పద స్థితిలో అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా పలు నేరాలు వెలుగు చూశాయి. హైదరాబాద్‌కు చెందిన మరో నిందితుడు మహ్మద్ రంజాన్ పరారీలో ఉన్నాడు. వీరంతా భానూర్ పోలీస్ స్టేషన్, సదాశివపేట పోలీసు స్టేషన్, సంగారెడ్డి రూరల్ పోలీసు స్టేషన్, నార్సింగి (హైదరాబాద్) పోలీసు స్టేషన్, ఉమర్గా పోలీసుస్టేషన్ మహారాష్ట్రలలో బైక్ దొంగతనాలకు పాలడినట్లు వివరించారు. వీరు దొంగలించిన బైక్‌లను లంగర్ హౌస్‌కు చెందిన మహ్మద్ అష్రఫ్, సయ్యద్ సాజిద్, పర్వేజ్ తదితరులకు విక్రయించారని వీరంతా పరారీలో ఉన్నారని డీఎస్పీ వివరించారు. కేసు నమోదు చేసిన బీడీఎల్ పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

కొర్వీపల్లి గ్రామస్థుల సమస్యలను తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే



గ్రామస్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

చిన్నశంకరంపేట, ఆగస్టు 5: మండలంలోని కొర్వీపల్లి గ్రామంలోని సోమవారం ఎమ్మెల్యే రోహిత్‌రావు గ్రామస్తులతో ముఖాముఖి ఏర్పాటు చేసి గ్రామ సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్తులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో గ్రామ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మహిళా భవనం కోసం తమ సొంత స్థలాన్ని కేటాయించనున్నట్లు చెప్పారు. అనంతరం దుర్గా భవాని ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శివప్రసాద్ శాస్త్రి పూర్ణకుంభంతో స్వాగతం పలికి అర్చన చేశారు. సోమేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే రోహిత్‌రావు వేడుకున్నారు. శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా మండల కేంద్రంలోని సోమేశ్వరాలయంలో శివుడికి అభిషేకం, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అర్చకులు సంగమేశ్వరశర్మ ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఆలయాభివృద్ధికి సహకరిస్తానని, నెలరోజుల్లో మరమ్మతులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఘనంగా 'హోప్' ఆస్పత్రి ద్వితీయ వార్షికోత్సవం



ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న ఆస్పత్రి ఎండీ కృష్ణమూర్తి, సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 4: సంగారెడ్డి చౌరస్తాలోని హోప్ న్యూరో అండ్ కార్డియాక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వితీయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రిలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ, ప్రముఖ న్యూరో సర్జన్ డా.టి.కృష్ణమూర్తి మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది సహకారంతో ఆస్పత్రి రెండేళ్ల కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బందిని సన్మానించి జ్ఞాపికలు అందజేసి పలువురిని అభినందించారు. అంతకుముందు చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డా.అనిల్‌కుమార్, డా.విఠల్, డా.వినయ్, డా.హర్ష, సిబ్బంది పాండు, శ్రీనివాస్, అమ్జద్, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి స్పందన కరువు

గ్రామ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యల పరిష్కారానికి ప్రతీ వారం మండల తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. సోమవారం పలు మండలాల్లో నిర్వహించిన ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరైనప్పటికీ అర్జీలు మాత్రం ఆశించిన స్థాయిలో అందలేదు.

కంది, ఆగస్టు 5: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మండల అభివృద్ధి, ఇరిగేషన్ శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. కాగా ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు మాత్రమే అందింది.

● పుల్‌కల్: పుల్కల్, చౌటకూర్ తహసీల్దార్ కార్యాలయాల వద్ద సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించినప్పటికీ, అక్కడ తహసీల్దార్లు స్వయంగా దరఖాస్తులు తీసుకోవాల్సి ఉండగా, కింది స్థాయి సిబ్బందిని కూర్చోబెట్టి దరఖాస్తులు స్వీకరించారు. ఈ ప్రజావాణికి అయా శాఖల అధికారులు ఎవరూ హాజరుకాకపోవడంతో మొక్కుబడిగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కాగా, చౌటకూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజావాణికి 8 దరఖాస్తులు మాత్రమే అందాయి.

● రేగోడు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు అందలేదని సిబ్బంది తెలిపారు.

రామాయంపేటలో మంచి స్పందన

రామాయంపేట, ఆగస్టు 5: రామాయంపేట తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 23 ఫిర్యాదులు అందాయి. అధికారులు మధ్యాహ్నం ఒంటిగంట వరకు దరఖాస్తులు తీసుకున్నారు. ప్రజలు వివిధ సమస్యలపై తహసీల్దార్ రజనీకి ఫిర్యాదులు చేశారు.

25వ రోజుకు రైతుల దీక్ష

నర్సాపూర్, ఆగస్టు 5: సంగారెడ్డి కెనాల్ కోసం భూములివ్వబోమంటూ రైతులు చేపట్టిన రిలేదీక్ష సోమవారం 25వ రోజుకు చేరుకుంది. దీక్షలో బ్రాహ్మణపల్లి, చిన్నచింతకుంట గ్రామానికి చెందిన రైతులు నర్సింహారెడ్డి, రాంకిషన్, రాజమౌళి, నారాయణ, తుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, ఆగస్టు 5: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని సూరారం గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ రహీం(25) కొన్ని నెలల నుంచి ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని బలవన్మరణం చెందాడు. మృతుడికి భార్య ఫరిహా, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మత్తు పదార్థాల వల్ల ఎన్నో అనర్థాలు

నర్సాపూర్, ఆగస్టు 5: మత్తు పదార్థాలకు అలవాటు పడి ఎంతో విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, యాంటి నార్కోటికి డీఎస్పీ రాములునాయక్‌లు పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో డ్రగ్స్ వాడకం వల్ల అనర్థాలు, సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీలు మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్ అమ్మినా, వినియోగించిన చర్యలు ఉంటాయన్నారు.

రంగంపేట పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో

కొల్చారం, ఆగస్టు 5: కొల్చారం మండల పరిదిలోని రంగంపేట జడ్పీహైస్కూల్‌ను డీఈవో రాధాకిషన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పారిశుధ్యం, వ్యక్తిగత శుభ్రత అంశాలపై నిర్వహిస్తున్న వ్యాసరచన, ఉపన్యాస పోటీలను పరిశీలించారు. వెంట ఎంఈవో నీలకంఠం, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ వర్తింపజేయాలి: పీఆర్టీయూ

మునిపల్లి, ఆగస్టు 5:ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను వర్తింపజేయాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్ గోపాల్ పేర్కొన్నారు. పీఆర్టీయూ పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కంకోల్, అంతారం, లోనికలాన్, పెద్దచెల్మెడ, తాటిపల్లి, కేజీబీవీ, గార్లపల్లి పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు చేసి తమకు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు చంద్రమౌళి, అసోసియేట్ అధ్యక్షుడు సిద్దేశ్వర్, జిల్లా నాయకులు ఉన్నారు.

కిక్ బాక్సింగ్ సేషనల్ రిఫరీగా మురళి, నవీన్

చిలప్‌చెడ్, ఆగస్టు 5: బాక్సింగ్ జాతీయ స్థాయి రిఫరీలుగా మండలంలోని సోమక్కపేట గ్రామానికి చెందిన బెస్త మురళి, నవీన్ ఎన్నికైనట్లు జిల్లా ప్రెసిడెంట్ పోచయ్య, పూర్ణచందర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో గల ఓ అకాడమీలో జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ రిఫరీ సెమినార్‌లో పాల్గొన్న వీరు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీరిద్దరిని జాతీయ స్థాయి రెఫరీలుగా ఎంపిక చేస్తూ ప్రశంసా పత్రాలను నేషనల్ రెఫరీ కమిటీ చైర్మెన్ సీమసేన్ వీరికి అందజేశారు.

'పార్టీల కతీతంగా అర్హులందరికీ సంక్షేమపథకాలు'

నారాయణఖేడ్, ఆగస్టు 5:పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమపథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని ఖేడ్, కంగ్టి, మనూరు, నాగల్‌గిద్ద, పెద్దశంకరంపేట, నిజాంపేట, కల్హేర్, సిర్గాపూర్ మండలాలకు చెందిన 200మందికి సీఎంఆర్ఎఫ్‌పథకాల చెక్కులను పంపిణీ చేశారు.

ప్రతీ పౌర్ణమికి అరుణాచలంకు ప్రత్యేక బస్సు

నారాయణఖేడ్,ఆగస్టు 5: ప్రతీ నెల పౌర్ణమి సందర్భంగా ఖేడ్ ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం క్షేత్రానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపనున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17న సాయంత్రం 4 గంటలకు ఖేడ్ నుంచి ప్రత్యేక బస్సు బయలు దేరుతుందన్నారు. 18న కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్‌లో దర్శనం చేయించుకొని, 19న పౌర్ణమినాడు అరుణాచలంలో గిరిప్రదక్షిణ చేయించి సాయంత్రం తిరుగు ప్రయాణం ఉంటుందన్నారు. 20న జోగులాంబ శక్తిపీఠాన్ని దర్శించుకొని అదే రోజు సాయంత్రం ఖేడ్‌కు చేరుకుంటారని వివరించారు. ఒక్కొక్కరికి రూ.4500 చార్జి ఉంటుందన్నారు. బుకింగ్‌కోసం 9959223170, 9441071134, 9676677033 నెంబర్లకు సంప్రదించాలన్నారు.